01ATP16_01ATP16.qxd 16-11-2026 PM 10:25 Page 1





అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 17 నవంబర్ 2026 పేజీలు : 04

హర..హర మహాదేవ

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు



స్వామివారి దర్శనానికి వెళుతున్న భక్తులు







శ్రీకేదారనోములను ఆచరిస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్, నవంబర్ 16 ప్రభాతవార్త

కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని శివాలయాలు హర హర మహాదేవ నామస్మరణతో పోటెత్తాయి. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండే పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారు, అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం అర్చకులు ఎం.యోగానందకుమార్‌శర్మ, రామకృష్ణశర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని రుద్రాక్షమాలలు, బిల్వపత్రాలు, వివిధ రకాల పూలమాలతో ప్రత్యేక ంగా అలంకరించి మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీపార్వతీదేవి అమ్మవారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, సహదేవశర్మ, శంతన్‌శర్మలు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో అర్చకులు పలువురితో శ్రీకేదారనోములను భక్తిశ్రద్ధలతో చేయించారు. ఆలయం మహాద్వారం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్ నాయుడు, సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్ ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని భారికేడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సిఐ ఆరోహనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాయి సేవలు నిర్విరామంగా సాగుతున్నాయి

ఆపన్న హస్తం కోసం ఎదురు చూసే వారికే చేయూత
ప్రతి ఏటా భక్తుల రద్దీ పెరుగుతున్నది
శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబర్ 15, ప్రభాతవార్త ప్రతినిధి

భగవాన్ సత్యసాయి బాబా తన అమృత హస్తాలతో స్థాపించి విస్తరింప చేసిన శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సేవలు బాబా కృపతో రోజురోజుకు బలోపేతం అవుతూ నిర్విరామంగా కొనసాగుతున్నాయని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్. జె. రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా ఆశయాల మేరకు నిరుపేదలకు ఆపన్న హస్తం అందించేలా ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నదన్నారు. భగవాన్ సత్య సాయి బాబా 101వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశ విదేశాల నుండి పెద్ద ఎత్తున భక్తుల తో పాటు ప్రపంచ దేశాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలి రానున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రశాంతి నిలయంలో రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతుండడంతో, వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమాలను పురస్కరించుకొని ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభ మందిరం, బాబా నివాసం ఉండే యజుర్వేద మందిరం, వినాయక మంటపం, సాయి గాయత్రి ఆలయం, లక్ష్మీఆలయం, ట్రస్ట్ భవనాలు, భోజనశాలలు, వీవీఐపీలు విడిది చేసే భవనాలు ఇప్పటికే ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయన్నారు. 2011 తర్వాత పుట్టపర్తిలో స్థబ్దతగా ఉండేదని ప్రస్తుతం అనిచ్చితి తొలగి అన్ని సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయన్నారు. ఎవరైతే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారో వారికి చేయూతనందించాలన్నదే సాయి అభిమతమని ఆ దిశగా సేవా కార్యక్రమాలు కొనసాగించడం జరుగుతోన్నదన్నారు. దేశంలోని రాష్ట్రాల భక్తులే కాకుండా ఆస్ట్రేలియా నుండి 700 మంది భక్తులు డిసెంబర్ నెలలో పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి వస్తున్నట్లు తెలిపారు. గతంలో కంటే ప్రశాంతి నిలయంకు దేశ విదేశీ భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. దేశంలోనే ఏ ప్రాంతంలో లేని విధంగా సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీల ద్వారా రోగులకు ఉచిత సేవలను అందిస్తూ వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. బాబా భక్తులు ప్రపంచంలోని వలు ప్రాంతాలలో బాబా ఆలయాలు నిర్మిస్తున్నారన్నారు. అందులో భాగంగానే పంజాబ్ లోని లుథియానలో సువిశాలమైన బాబా ఆలయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఏర్పాట్లు సంబంధించి సోమవారం నుండి ఈనెల 24 తేదీ వరకు నారాయణ సేవకొనసాగుతుందన్నారు.18వ తేదీ సత్యసాయి వేణుగోపాల స్వామి రథోత్సవ వేడుకలతో బాబా 101 వ జయంతి వేడుకలు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. 19 న మహిళా దినోత్సవం 20, 21 తేదీలలో సత్యసాయి సేవాదళ్ సమ్మేళనము నిర్వహించనుండగా, ఈ కార్యక్రమంలో దాదాపుగా 20వేల మంది సేవాదళ్ సభ్యులు దేశంలోని 28 రాష్ట్రాల నుండి పాల్గొంటారని తెలియజేశారు. 22 వ తేదీన నిర్వహించే సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారన్నారు. 23న భగవాన్ సత్యసాయి బాబా 101వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులు కోటేశ్వరరావు, లక్ష్మణరావు, చంద్రశేఖరన్, సుందర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గతేడాది కంటే ఈసారి ఎక్కువ ఖర్చు దిశగా ఉపాధి హామీ!



- 2025-26లో ఏడాది మొత్తానికి రూ.388.10 కోట్లు వ్యయం
-ఈ ఏడాది నవంబర్ 16 నాటికే రూ.344.89 కోట్లు ఖర్చు
- కూలీల వేతనాల చెల్లింపుల్లో ఇప్పటికే గతేడాది మొత్తాన్ని అధిగమించిన ప్రస్తుత ఏడాది
- మరో నాలుగు నెలలు మిగిలి ఉండటంతో మరింత పెరగనున్న వ్యయం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త

జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధుల ఖర్చు వేగంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం మీద రూ.388.10 కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది నవంబర్ 16వ తేదీ నాటికే రూ.344.89 కోట్ల వ్యయం నమోదైంది. ముఖ్యంగా కూలీల వేతనాల చెల్లింపుల్లో గత ఏడాది మొత్తం ఖర్చును కూడా ప్రస్తుత ఏడాది అధిగమించింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నాలుగు నెలలకుపైగా సమయం ఉండటంతో మార్చి నెలాఖరుకు నిధుల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది మొత్తం ఖర్చుతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే భారీ మొత్తంలో వ్యయం జరగడం గమనార్హం.

కూలీల వేతనాల్లో గతేడాది కంటే అధికం:

2025-26 ఆర్థిక సంవత్సరంలో కూలీల వేతనాల రూపంలో రూ.242.41 కోట్లు చెల్లించారు. అయితే ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 16 నాటికే రూ.257.63 కోట్లు చెల్లించారు. అంటే గత ఏడాది ఏడాది మొత్తం చెల్లింపుల కంటే ఈసారి ఇప్పటికే రూ.15.22 కోట్లు అధికంగా కూలీలకు వేతనాలు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు కల్పిస్తున్న ఉపాధి, వేతనాల చెల్లింపుల్లో ఈ వ్యయం నమోదవుతోంది.

మెటీరియల్, అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు:

గత ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులకు అవసరమైన మెటీరియల్ కోసం రూ.122.60 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత ఏడాది నవంబర్ 16 నాటికి రూ.67.61 కోట్లు వినియోగించారు. అలాగే గత ఏడాది అడ్మినిస్ట్రేషన్ ఖర్చులు రూ.23.07 కోట్లు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు రూ.19.65 కోట్లు ఖర్చు చేశారు. ఈ రెండు విభాగాల్లో ఇంకా గత ఏడాది మొత్తం వ్యయాన్ని చేరుకోవాల్సి ఉంది.

మరో నాలుగు నెలల్లో మరింత పెరగనున్న ఖర్చు:

గత ఆర్థిక సంవత్సరం 2025-26లో ఉపాధి హామీ పథకానికి మొత్తం రూ.388.10 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 16 నాటికే రూ.344.89 కోట్లు వ్యయం చేశారు. అంటే గత ఏడాది మొత్తం ఖర్చుకు చేరువగా ప్రస్తుత ఏడాది వ్యయం నమోదైంది. మరో నాలుగు నెలలకుపైగా సమయం ఉండటంతో ఈసారి గత ఏడాది మొత్తం ఖర్చును అధిగమించే అవకాశం ఉంది. మిగిలిన కాలంలో కూలీలకు ఉపాధి కల్పన, అభివృద్ధి పనుల నిర్వహణ, మెటీరియల్ వినియోగం పెరిగే కొద్దీ మొత్తం వ్యయం కూడా పెరగనుంది.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం:

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించడంతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి వివిధ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాది ఇప్పటివరకు కల్పించిన పనిదినాలు, ఉపాధి పొందిన కుటుంబాలు, వంద రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల వివరాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిధుల ఖర్చుతోపాటు పనుల పురోగతి, గ్రామీణ ప్రాంతాల్లో వాటి ద్వారా కలిగిన ప్రయోజనాలపై కూడా అధికారులు వివరాలు వెల్లడించాల్సి ఉంది. మొత్తంగా చూస్తే గత ఏడాది ఏడాది మొత్తం జరిగిన వ్యయానికి చేరువగా ఈ ఏడాది నవంబర్ నాటికే ఖర్చు జరగడంతో, మిగిలిన నాలుగు నెలల్లో ఉపాధి హామీ పథకం వ్యయం మరింత పెరగనుంది. దీనిపై అనంతపురం డ్వామా పీడీ నలీంబాష ను వివరణ అడగగా....గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరగడంతో నిధుల ఖర్చు కూడా అధికంగా ఖర్చు చేశాము. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వలసలను అరికట్టి గ్రామాల్లోనే కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రానున్న నాలుగు నెలల్లో నిధుల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని, సీసీ, బీటీ రోడ్ల వంటి గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి వాటి సాధనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలలో
అగ్రిస్టాక్ సమాచారాన్ని రైతులకు ఉపయోగపడేలా చూడాలి



వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ నవంబర్ 16 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో అగ్రిస్టాక్ సమాచారాన్ని రైతులకు ఉపయోగపడేలా ఏ విధంగా వినియోగించవచ్చు అను అంశంపై జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షత వహించగా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మరియు జిల్లా వ్యవసయాధికారి, జిల్లా సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, రెవిన్యూ, నీటిపారుదల, పౌర సరఫరాలు, పంచాయతిరాజ్, మార్కెటింగ్, ప్లానింగ్, బ్యాంకింగ్, ట్రైబల్ వెల్ఫేర్ మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రిస్టాక్ ప్లాట్ ఫోరం ద్వారా రైతులకు సులభంగా ప్రభుత్వ పథకాలు, వేగంగా పంట రుణాలు, పంటల భీమ మరియు నష్ట పరిహారం, వ్యవసాయ సలహాలు, మద్దతు ధర కొనుగోళ్లు వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో ఈ అగ్రిస్టాక్ ప్లాట్ ఫోరంను వారి శాఖల పథకాలలో ఏవిధంగా వినియోగించవచ్చో తెలియజేయాలని హాజరైన అధికారులకు సూచించారు. ఈ సమాచారాన్ని 5 రోజులలోగా తయారు చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.సాలు రెడ్డి మాట్లాడుతూ అగ్రిస్టాక్ అనేది భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఒక రైతు కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అని, ఈ ప్లాట్ ఫోరం దేశంలోని రైతులు వారి భూమి రికార్డు మరియు పంటల వివరాలన్నింటిని ఒకే డిజిటల్ వేదిక పైకి తీసుకొస్తుందని వివరించారు. అగ్రిస్టాక్ ప్రధానంగా రైతు రిజిస్ట్రీ, వ్యవసాయ భూమి రిజిస్ట్రీ, జియో రిఫరెన్స్ పటములు మరియు సాగుపంటల రిజిస్ట్రీ ఆధారంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, రెవిన్యూ, నీటిపారుదల, పౌర సరఫరాలు, పంచాయతి రాజ్, మార్కెటింగ్, ప్లానింగ్, బ్యాంకింగ్, ట్రైబల్ వెల్ఫేర్ మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ 2026 పేరుతో అంతర్జాతీయ వేదికపై
దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం సిగ్గుచేటు

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ.. దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి



శ్రీసత్యసాయిజిల్లా, నవంబర్ 16 ప్రభాతవార్త ప్రతినిధి

భారత్ సమ్మిట్ 2026 పేరుతో అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం సిగ్గుచేటు అని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ..దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ సమ్మిట్-2026లో ఇటలీకి చెందిన పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశానికి ప్రధానమంత్రి కావాలని కలలు కంటున్న రాహుల్ గాంధీ, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రపంచ దేశాల ప్రతినిధుల ముందు విమర్శలకు గురిచేసే వేదికలను ప్రోత్సహించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. 97 కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అలాంటి భారతదేశానికి విదేశీ రాజకీయ ప్రతినిధులు ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ ప్రతినిధుల జోక్యాన్ని ఏమాత్రం సమర్థించలేము. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై వ్యాఖ్యలు చేయడానికి విదేశీ ప్రతినిధులను ఆహ్వానించి వేదిక కల్పించడం కాంగ్రెస్ పార్టీ రాజకీయ దురుద్దేశాలకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. భారత్ సమ్మిట్‌కు 315 మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు పేర్కొన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో ఆశించిన స్పందన లభించలేదన్న అంశంపై కాంగ్రెస్ పార్టీ వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధుల పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి, అదేవిధంగా విదేశీ ప్రతినిధుల వీసా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి, తప్పు జరిగినట్లు తేలితే అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భారతదేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అంతర్జాతీయ వేదికపై వివాదాస్పదం చేసిన ఈ వ్యవహారానికి సంబంధించి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రతిష్ఠను పణంగా పెట్టే చర్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేయడం అంటే నేరుగా దేశ ద్రోహాని పాల్పడడానికి సమానం. ఈ విషయంలో దేశ ప్రజలు, యావత ఆగ్రహంతో రగిలిపోతున్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదు అని స్పష్టం చేస్తున్నామన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పనిచేయాలి

ఎల్ నినో ప్రభావం దృష్ట్యా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, నవంబర్ 16, ప్రభాతవార్త

జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా, భూగర్భ జలమట్టాలను నిరంతరం పెంచడమే లక్ష్యంగా నీటి పారుదల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ లు ఈ కార్యక్రమాన్ని ఒక నిరంతర ప్రక్రియగా నిర్వహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఇరిగేషన్, డ్వామా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇరిగేషన్ శాఖ అధికారులు, డ్వామా అధికారులతో పాటు ఏపీడి, ఏ పీ ఓ, ఏ ఈలతో జిల్లా కలెక్టర్ చేసే పనుల ప్రగతిపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల ప్రణాళిక అనేది క్షేత్ర స్థాయిలో రెండు రోజులలో పూర్తి కావాలన్నారు. 48 గంటలలో జిల్లా కలెక్టర్ అనుమతుల తో సహా ఆమోద ప్రక్రియ పూర్తి కావాలని, వీటిలో ఎవరూ ఆలస్యం చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్నినో పరిస్థితులు ఉన్నందున, రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ అధికారులు వెంటనే జిల్లాలోని అన్ని చెరువులు, కాలువలు, కుంటలలో అవసరమైన మరమ్మత్తులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి బొట్టు చెరువులు, కుంటల్లోకి చేరి భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. డ్వామా అధికారులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పిస్తూ, జలధార జలహారతి 2.0 కింద కేటాయించిన జల సంరక్షణ పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయాలన్నారు. పూడికతీత,చెక్ డ్యామ్‌ల నిర్మాణం,ఇంకుడు గుంతలు, చెరువుల పునరుద్ధరణ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్షలో పాల్గొన్న ప్రతి అధికారినీ "వాటర్ ప్రూఫైడింగ్ అధికారి"గా కలెక్టర్ అభివర్ణించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి, సాగునీటి ఎద్దడి రాకూడదని, నీటి అవసరం ఎక్కడ ఉన్నా గుర్తించి అక్కడ భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవడం అధికారుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ, డిడబ్ల్యుఎంఏ పిడి విజయ ప్రసాద్,ఇరిగేషన్ ఇఇ,డ్వామా శాఖల ఉన్నతాధికారులు, ఏపీడిలు, ఏపీఓ లు, ఏ ఇ లు తదితరులు పాల్గొన్నారు.

చిత్రగుప్త యాప్‌పై శిక్షణ

-పైలట్ ప్రాజెక్టుగా మోడల్ కాలనీలను విజయవంతం చేయండి : కలెక్టర్ ఓ.ఆనంద్





చిత్రగుప్త యాప్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్, హాజరైన అధికారులు

అనంతపురం నవంబరు16 ప్రభాతవార్త

చిత్రగుప్త యాప్‌పై శిక్షణ కార్యక్రమంలో పైలట్ ప్రాజెక్టుగా నగరంలో మోడల్ కాలనీలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషలాఫీసర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో చిత్రగుప్త యాప్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

ఈ శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షతన , అసిస్టెంట్ కలెక్టర్ సుయుష్ కుమార్ హాజరైయ్యారు.ఈ శిక్షణలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగపు అధికారులు, సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, ఆమెనిటీస్,శానిటేషన్ సెక్రటరీలకు శిక్షణకు హాజరైయ్యారు.పైలట్ ప్రాజెక్టుగా నగరంలోని ఆదిమూర్తి నగర్, కమలా నగర్, రామచంద్ర నగర్, సాయి నగర్, జీరో క్రాస్, టవర్ క్లాక్ మరియు ఉమా నగర్ లలో ఈ యాప్ ను చేపట్టారు. క్షేత్రస్థాయిలో నమోదు చేసిన వివరాలను సంబంధిత రెవెన్యూ, ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారుల లాగిన్ లకు మ్యాప్ చేయడం జరుగుతుందని, వాటిని వారు వారం రోజుల లోపల క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ నెల 22 లోపల యాప్ నందు వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ యాప్ ఏఐ సాంకేతికతతో పనిచేస్తుందని, దీని ద్వారా ఇంటి పన్ను లేని నిర్మాణాలను గుర్తించడానికి, వీధి దీపాల మరమ్మత్తులు, రోడ్ల మరమ్మత్తులను గుర్తించడం వంటి వాటితో నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంపొందించేందుకు చిత్రగుప్త యాప్ కంపెనీ బెంగళూరు ప్రతినిధులు తెలియజేశారు. ఈ శిక్షణకు హాజరైన వారందరూ ఈ యాప్ పట్ల పూర్తి అవగాహన చేసుకొని జిల్లా కలెక్టర్ ఆదేశించిన గడువులోగా క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తిచేసి చిత్రగుప్త యాప్ నందు వివరాలను నమోదు చేయాలని కమిషనర్ జస్వంత రావు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, టి.పి.ఓ ఓంకార్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు సత్యనారాయణ, దాక్షాయణి, రెవెన్యూ అధికారులు లక్ష్మిదేవి, సుజాత, రెవెన్యూ ఇన్ స్పెక్టర్లు, పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన స్వర్ణ వార్డు కార్యదర్శులు హాజరు అయ్యారు.

ఉరవకొండలో విచ్చలవిడిగా అక్రమ కులాయిల దందా..!
కన్నతల్లిపై గొడ్డలితో దాడిచేసిన కుమారుడు 4 >>
రెండో దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు పటిష్ట భద్రత..
కదిరి నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యం

02ATP26_02ATP26.qxd 16-11-2026 PM 10:24 Page 1

శెట్టూరు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల జోరు!

రెండో రోజు భారీగా నామినేషన్లు.. సర్పంచ్ స్థానాలకు 78, వార్డు సభ్యులకు 121 దరఖాస్తులు



నామినేషన్ దాఖలు చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి మహేష్



సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న చిత్తప్ప

శెట్టూరు, నవంబర్ 16 ప్రభాతవార్త

మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొనగా, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు.మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వెల్లడించిన 16 112026 నాటి నామినేషన్ల నివేదిక ప్రకారం మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ స్థానాలకు ఇప్పటివరకు మొత్తం 78 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 121 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీఓ జిలాని భాష తెలిపారు.సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు 17, రెండో రోజు 61 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు మొదటి రోజు 8, రెండో రోజు 113 నామినేషన్లు నమోదయ్యాయి. రెండో రోజునే అత్యధికంగా నామినేషన్లు దాఖలు కావడం ఎన్నికల పోటీ తీవ్రతను తెలియజేస్తోంది.గ్రామాల వారీగా పరిశీలిస్తే చినంపల్లి గ్రామంలో సర్పంచ్ స్థానానికి అత్యధికంగా 10 నామినేషన్లు నమోదయ్యాయి. చెర్లోపల్లి, చిన్నంపల్లి, బచ్చేహళ్లి తదితర గ్రామాల్లోనూ పోటీ ఆసక్తికరంగా మారుతోంది. వార్డు సభ్యుల స్థానాలకు బచ్చేహళ్లి లో 28, చినంపల్లిలో 16, ఇదులబాల ప్రాంతంలో 15 నామినేషన్లు నమోదైనట్లు నివేదికలో ఉంది.మొత్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్ల దాఖలయ్యే అవకాశం ఉండటంతో ప్రధాన పార్టీల నాయకులు, ఆశావహులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ఫ్రెషర్స్ పార్టీ

- కళాశాల వాణిజ్య విభాగాల ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమం
- నూతన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికిన సీనియర్ విద్యార్థులు
- ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల ఆటపాటలు, పరిచయ కార్యక్రమాలు



ప్రిన్సిపాల్ ను సన్మానిస్తున్న దృశ్యం



మోక్కలు నాటుతున్న దృశ్యం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఉరవకొండ, నవంబర్ 16 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ పార్టీ అట్టహాసంగా జరిగింది. కళాశాల వాణిజ్య విభాగం (బీకాం) మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘనంగా వెల్‌కమ్ పార్టీ ఇచ్చారు. బీకాం సీనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణి ముఖ్య అతిథిగాహాజరై మాట్లాడుతూ కళాశాలలో అడుగుపెట్టిన నూతన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. చదువుతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పాటిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.సోమశేఖర్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నటువంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని, జేకేసీ, లైబ్రరీ పుస్తకాలను చదువుకొని జీవితంలో పైకి రావాలని సూచించారు. వాణిజ్య విభాగాధిపతి నీలి వెంకటేసులు మాట్లాడుతూ విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లని బాధ్యతగా మెలిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి మోక్కలు నాటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రిన్సిపాల్ డా॥టి.శైలజారాణిను శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు నిరంతర వైద్య సేవలే లక్ష్యంగా వైద్య శిబిరం ప్రారంభం

24 గంటల పాటు వైద్య సేవలు 150 మంది వైద్య నిపుణులతో వైద్య శిబిరం
వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి టౌన్, నవంబర్ 16, ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శతజయంతి వైద్య శిబిరం సోమవారం ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నవంబర్ 16 నుంచి 24వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు భక్తులు, యాత్రికులకు నిరంతరాయంగా 24 గంటలూ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన వైద్య శిబిరాన్ని నార్త్ 1 బిల్డింగ్‌లో, మరో వైద్య శిబిరాన్ని ఆశ్రమ వెస్ట్ గేట్ సమీపంలోని శివం సుందరం ఎన్‌క్లేవ్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్, శ్రీ సత్యసాయి సేవా సంస్థలకు చెందిన వైద్య నిపుణులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు సమిష్టిగా సేవలందిస్తున్నారు. మొత్తం 150 మంది వైద్యులు ఇందులో పాల్గొంటుండగా, వారిలో 79 మంది పురుషులు, 71 మంది మహిళా వైద్యులు ఉన్నారు. వీరితో పాటు 73 ఆరోగ్య సంరక్షణ నిపుణులు, 91 మంది సేవాదళ్ సభ్యులు సేవలందిస్తున్నారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల వైద్యం, గైనకాలజీ, కార్డియాలజీ, పల్మనాలజీ, క్యాన్సర్ వైద్యం, చర్మవ్యాధులు, మానసిక వైద్యం వంటి విభాగాలతో పాటు జనరల్ సర్జరీ, చెవిముక్కుగొంతు, కంటి వైద్యం, దంత వైద్యం, పాదాల సంబంధిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వైద్య నిపుణులు, ఆరోగ్య సిబ్బంది, సేవాదళ్ సభ్యులు తమ విలువైన సమయాన్ని స్వామి సేవకు అంకితం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో సేవ, ప్రేమ, త్యాగం అనే ఆదర్శాలకు ఈ వైద్య శిబిరం నిదర్శనంగా నిలుస్తోంది.

వైభవంగా ఆకాశదీపం, కార్తీక దీపోత్సవం

- భక్తిశ్రద్ధలతో మల్లేశ్వరస్వామి నంది వాహనోత్సవం
- వందలాదిగా తరలివచ్చి దీపాలు వెలిగించిన భక్తులు



మల్లేశ్వరస్వామి



ధ్వజస్తంభంకు వెలిగించిన ఆకాశ దీపం



నంది వాహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ధ్వజ స్తంభంకు జ్యోతిని వెలిగిస్తున్న అర్చకుడు



ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఉరవకొండ, నవంబర్ 16 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం కార్తీక మాసం రెండో సోమవారం రాత్రి ఆకాశదీపం, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు రాత్రి ఆవరణంలో ధ్వజస్తంభానికి ఆకాశ దీపాన్ని వెలిగించి కార్తీక దిపోత్సవాన్ని ప్రారంభించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భ్రమరాంబ మలేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి పల్లకీ ఉత్సవాన్ని హర హర మహాదేవ శంభో శంకర అంటూ నిర్వహించారు. ఉదయం మల్లేశ్వరస్వామి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, అలంకరణ, బిల్వార ్చన, విశేష పూజలు నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు, కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారికి తీర్థప్రసాదాలు పంచిపెట్టింది.

18న లేపాక్షికి పేజావర్ స్వామీజీ రాక

లేపాక్షి, నవంబర్ 16 ప్రభాతవార్త



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న పరిగి వేణుగోపాలరావు

అయోధ్య రామమందిరానికి ప్రాణప్రతిష్ఠ చేసిన శ్రీపేజావర్ స్వామీజీ ఈ నెల 18న బుధవారం సాయంత్రం 5 గంటలకు లేపాక్షి శ్రీదుర్గా వీరభద్రస్వామి ఆలయానికి విచ్చేయనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు తెలిపా రు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్వామీజీకి ఆలయ చరిత్ర, శిల్పకళా వైభవాన్ని వివరించనున్నట్లు తెలిపారు. భక్తులు, స్థానికులు పెద్దసంఖ్యలో హాజరై స్వామీజీని దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

అదృశ్యమైన వృద్ధురాలు హత్య

- పెట్రోల్ పోసి తగలబెట్టిన వైనం - మెడలోని బంగారం కోసమే
హత్య చేశారన్న బంధువులు, గ్రామస్తులు - విచారణ చేస్తున్న పోలీసులు



హత్య చేసిన ప్రాంతంలో విచారణ చేస్తున్న పోలీసులు

రొద్దం నవంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని దొడగట్ట కొట్టాల గ్రామానికి చెందిన భారతమ్మ (75) శుక్రవారం అదృశ్యం కావడం జరిగింది. బంధువులు అదృశ్యమైన భారతమ్మ కనబడకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. శుక్రవారం పీఎఫ్ షాపులో బియ్యం తీసుకురావడానికి పోయి అక్కడి నుండి అదృశ్యం కావడం జరిగింది. పోలీసులు విచారణ మేరకు దొడగట్ట గ్రామ సమీపాన పడమర దిక్కున శవాన్ని కాల్చి వేయడం జరిగింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టడం జరిగింది.

భైరవానితిప్ప సర్పంచ్ అభ్యర్థిగా ఆశ సోమశేఖర్ నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న ఆశ

బ్రహ్మసముద్రం నవంబర్ 16 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ పెద్దలు ఎంపిక చేసిన ఆశ సోమశేఖర్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆయన ఒక సెట్ నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆశ సోమశేఖర్ కు మద్దతు తెలిపారు. భైరవానితిప్ప గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో టీడీపీ అభ్యర్థిగా ఆశ సోమశేఖర్ నిలవడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొని విద్యార్థులకు గాయాలు



ప్రమాదం జరిగిన ప్రదేశం

గుడిబండ నవంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని కెవెన్ పల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అమరాపురం నుంచి గుడిబండ వైపు వస్తున్న ట్రాక్టర్‌ను, గుడిబండ నుంచి వెళ్తున్న విద్యార్థుల ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థులు అమరాపురం మండలం హనుమంతనపల్లికి చెందిన వారిగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గుడిబండ ఏఎస్ఐ మారుతిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికల పాత్ర కీలకం

ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో ప్రత్యేక గుర్తింపు

పత్రికలు కేవలం వార్తాంశాలను తెలపడమే కాక ప్రజలకు సమాచారాన్ని చేరవేసి విజ్ఞానం : ప్రధానోపాధ్యాయులు శ్రీధర్



స్థానిక విలేకరులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

రొళ్ల నవంబర్ 16 ప్రభాతవార్త

పత్రికలు కేవలం వార్తాంశాలను తెలపడమే కాక ప్రజలకు సమాచారాన్ని చేరవేసి విజ్ఞానాన్ని,వినోదాన్ని పత్రికలు అందిస్తాయని శ్రీ లక్ష్మీ విద్యానికేతన్ ఇంగ్లీష్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ పత్రికల దినోత్సవంను రొళ్ల మండలంలోని లక్ష్మీ విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పత్రిక విలేకరుల వారి సాహసాలను వాటి విలువలను గుర్తించుకుంటూ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ విద్యార్థులకు చక్కగా వివరించారు. ఆయన మాట్లాడుతూ..మన దేశంలో పత్రికలకు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందన్నారు.స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటంలో,ఉద్యమకారులను సంఘటితం చేయడంలో ఇవి ముఖ్య భూమిక పోషించాయిన్నారు. ప్రస్తుత టెలివిజన్, సోషల్ మీడియా యుగంలో పత్రికలు ప్రజలకు నిజమైన వార్తలను అందిస్తూ విశ్వసనీయతను మెరుగుపరుచుకుంటూనే ఉన్నాయన్నారు.ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, స్వార్థ పూరిత నాయకుల పాత్రను ఎండగట్టడంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ సామాన్యులకు అండగా నిలుస్తున్నాయిన్నారు.మన దేశంలోని స్వేచ్ఛాయుత, బాధ్యతాయుల పత్రికలను గౌరవించుకునే ఉద్దేశంతో ఏటా నవంబరు 16న ఖిజాతీయ పత్రికా దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు.ఉన్నత పాత్రికేయ ప్రమాణాలను కాపాడటం; జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి, వారిని గౌరవించడం జాతీయ పత్రిక దినోత్సవ ముఖ్య ఉద్దేశం అన్నారు.ప్రపంచ దేశాల్లో జర్నలిస్టులు, మీడియాకు ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ ఆధారంగా ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే రిపోర్టర్స్ వితౌ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) అనే సంస్థ ఏటా వరల్డ్ ప్రెస్ ఫ్రీడం డే జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు.

అలాగే పత్రికా రంగం సాధించిన విజయాలు,నేటి కాలంలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను విద్యార్థులకు వివరించారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో, ప్రజల్లో చైతన్యం కల్పించడంలో పత్రికా రంగం అందిస్తున్న ప్రత్యేక సేవలను కొనియాడారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. అనంతరం పలువురు పాత్రికేయులు వారి అనుభవాలను జర్నలిజం ప్రాముఖ్యత, పత్రికా స్వేచ్ఛ, సమాజం పట్ల పాత్రికేయుల బాధ్యతలను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు కూడా పత్రికా రంగం గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా రంగం సేవలను గుర్తుచేసుకుంటూ కార్యక్రమాన్ని విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేఖరులు విశాలాంధ్ర విలేఖరి భీమరాజ్,వార్త విలేఖరి సన్నతిమ్మప్ప,ఈనాడు విలేఖరి నాగరాజ్,తెలుగోడు విలేఖరి తిమ్మరాజు, సాక్షి రవికుమార్,ఆంధ్రప్రభ రామాంజి నాయక్,సుమన్ టీవీ పరమేష్, ఉపాధ్యాయులు గోవిందరావు, శ్రీనివాసరావు,సురేష్,సౌజన్య తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు చిరస్మరణీయం

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మహనీయుల సేవల స్మరణ

కణేకల్, నవంబర్ 16 ప్రభాతవార్త

గ్రంథాలయ ఉద్యమం ద్వారా సమాజంలో విజ్ఞానాన్ని, విద్యా చైతన్యాన్ని వ్యాప్తి చేసిన మహనీయుల సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కణేకల్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితర మహనీయుల చిత్రపటాలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులు సూర్యకాంత రెడ్డి, రోజేష్మ, హిదాయితుల్లా ఖాన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి డి. మల్లికార్జున మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల భాండాగారాలు మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని అందించే కేంద్రాలని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారులు తమ జీవితాలను గ్రంథాలయాల అభివృద్ధికి అంకితం చేసి సమాజంలో పఠనాసక్తిని పెంపొందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు.ప్రస్తుత తరంలో విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను స్మరించుకోవడం, వారి ఆశయాలను భావితరాలకు తెలియజేయడం ఎంతో అవసరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి. మల్లికార్జున, ఉపాధ్యాయులు సూర్యకాంత రెడ్డి, రోజేష్మ, హిదాయితుల్లా ఖాన్, వెంకటేశులు, ఓబులేష్, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు నామినేషన్లు చేయడానికి చివరి రోజు

- రెండవ రోజు 132 నామినేషన్లు దాఖలు
- సర్పంచు 44, వార్డు సభ్యులు 88 నామినేషన్లు

గుమ్మఘట్ట, నవంబర్ 16 ప్రభాతవార్త

తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మండల వ్యాప్తంగా రెండవ రోజు సర్పంచు స్థానాలకు 44 వార్డు సభ్యులు 88 మొత్తం 132 నామినేషన్లు పత్రాలు సమర్పించారని మండల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో, జయరాములు తెలిపారు. నేడే చివరి రోజు నామినేషన్ల దాఖలు చేయడానికి అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళులు



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు, నవంబర్ 16 ప్రభాతవార్త

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళులర్పించారు. వారోత్సవాల కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ వెంకటేశ్వరరావు, సర్దార్ వల్లభాయ్‌పటేల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మినారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ప్రజల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడానికి గ్రామ గ్రామాన గ్రంథాలయాల స్థాపనకు విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. అలాగే భారతదేశ స్వాతంత్రం సాధించడానికి మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ తదితరులు ప్రాణ త్యాగాలు చేశారని కొనియాడారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని కే.సుజాత, రికార్డు అసిస్టెంట్ ఆదిలక్ష్మి, నరసింహా, పాఠకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

03ATP27_03ATP27.qxd 16-11-2026 PM 10:41 Page 1

గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి ఆలయాలు

- విద్యార్థులు పఠనాభిరుచిని పెంపొందించుకోవాలి

- ఉపాధ్యాయులు డి.గౌస్



గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, నవంబరు 16 ప్రభాతవార్త బ్యూరో

జాతీయ గ్రంథాల య వారోత్స వాలు- 2026 లో భాగంగా మూడవ రోజు కార్య క్రమాన్ని సోమవారం పెద్దపప్పూరు శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భం గా విజ్ఞాన సందే శాలు గ్రంథాలయో ద్యమ మహనీయుల స్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపప్పూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు డి.గౌస్ మాట్లాడుతూ..విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్య, విజ్ఞానం, సాహిత్యం, సంస్క ృతి, నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ సేవలను స్మరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్యతో పాటు గ్రంథాలయోద్యమం, సాహిత్యం, పుస్తక ప్రచురణ, విజ్ఞాన వ్యాప్తికి జీవితాలను అంకితం చేసిన మహనీయుల సేవలను కొనియాడుతూ ఘన నివాళులర్పించారు. గ్రంథాల యాలు కేవలం పుస్తకాల భాండాగారాలు మాత్రమే కాదని, అవి విజ్ఞాన వికాసానికి, సామాజిక చైతన్యానికి, సమాజ ప్రగతికి దోహదపడే జ్ఞాన కేంద్రాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారిణి కె.చంద్రకళ పాల్గొని కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు.

శిక్షణా తరగతులను వాయిదా వేయాలి!

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి విజ్ఞప్తి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త



ప్రాథమిక పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతులకు బోధించే ఉపాధ్యాయుల కోసం నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వాయిదా వేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి సోమవారం సంబంధిత అధికారులను కోరారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు గుంటూరులో జిల్లా వనరుల వ్యక్తులు (డీఆర్‌పీలు)గా ఎంపికైన ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం డీఆర్‌పీలుగా ఎంపికైన ఉపాధ్యాయులు ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సెన్సస్ శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మరోవైపు పాఠశాలల్లో ఎస్ఏ1 పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఇదే సమయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల విధుల కోసం పలువురు ఉపాధ్యాయులకు ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు)గా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే ఒక విడత శిక్షణ పూర్తి చేసుకోగా, రెండో విడత శిక్షణకు ఈ నెల 21న హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. ఒకవైపు సెన్సస్ శిక్షణ, మరోవైపు పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ, ఇంకోవైపు ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోందని రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేసి, ఉపాధ్యాయులకు అనుకూలమైన సమయంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సిరివరంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన..

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన..



సిరివరంలో రైతు సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, పాల్గొన్న రైతులు..

గార్లదిన్నె, నవంబర్ 16, ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం సిరివరం గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మహానంది వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) రెడ్డిపల్లి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చి. శ్యామ్ రాజ్ నాయక్ మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో పాటు చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిరుధాన్యాలతో వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులు, విలువ జోడింపుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని తెలిపారు. విద్యావతి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, నేల స్వభావానికి అనుగుణంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రసాయన ఎరువుల మితిమీరిన వినియోగంతో నేల ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. డాక్టర్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పంట కాలానికి కేవీకే ద్వారా అందించే విత్తనాలు, పంటల్లో చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగుమందులు, వాటి సరైన మోతాదు, వినియోగ విధానాలపై అవగాహన కల్పించారు. కమలాబాయి మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు, యంత్రాల వినియోగంపై రైతులకు శిక్షణ అందిస్తున్నామని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వ్యవసాయ ప్రదర్శన

అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు సందర్శించారు. వివిధ పంటల సాగు విధానాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, చిరుధాన్యాల ప్రాధాన్యత, విలువ ఆధారిత ఉత్పత్తులపై నమూనాలు, సమాచార పోస్టర్లను విద్యార్థులు ప్రదర్శించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్న వ్యవసాయ అంశాలు, అనుభవాలను రైతులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సి. శ్రీనివాసరెడ్డి, ఏడీఏ డీఆర్‌సీ విద్యావతి, పీడీఏ ఆత్మ అప్పలస్వామి, డాక్టర్ కే. సుధారాణి, డాక్టర్ బి.కే. కిషోర్ రెడ్డి, గార్లదిన్నె మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, కమలాబాయి, చైతన్య తదితరులు పాల్గొన్నారు. సిరివరం, నమతాబాద్, కత్రిమల గ్రామాలకు చెందిన రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పొందారు.


సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు అవకాశం

అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనల స్వీకరణ

డీఎస్సీ2003 ద్వారా ఎంపికై 2004 సెప్టెంబర్ 1 తర్వాత విధుల్లో చేరిన వారికి వెసులుబాటు

ఈనెల 20లోగా రెండు సెట్లలో ప్రతిపాదనలు సమర్పించాలని విద్యాశాఖ ఆదేశాలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 1 ప్రభాతవార్త



సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) పరిధిలో ఉన్న ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికై, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన అర్హులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేసే అంశంపై ప్రభుత్వం విధివిధానాలు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 158, తేదీ 09112026 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి సోమవారం సూచనలు జారీ అయ్యాయి. ముఖ్యంగా డీఎస్సీ 2003 నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికై, 2004 సెప్టెంబర్ 1వ తేదీ తర్వాత విధుల్లో చేరిన అర్హులైన ఉపాధ్యాయుల వివరాలను సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సంబంధిత ఉపాధ్యాయులు తమ నియామకానికి సంబంధించిన ఆధారాలు, సర్వీస్ రికార్డులతో కూడిన రెండు సెట్ల ప్రతిపాదనలను ఈ నెల 20వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. ప్రతిపాదనలతో పాటు అనేక్షర్ 2దరఖాస్తు ఫారాన్ని డీడీఓ కౌంటర్ సంతకంతో జతచేయాలి. దీళీది2003 రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ కాపీ, ప్రాథమిక నియామక ఉత్తర్వుల కాపీ, సర్వీస్ రిజిస్టర్ (ళీళి) మొదటి ఐదు పేజీలను డీడీఓ కౌంటర్ సంతకంతో సమర్పించాలి. వీటితో పాటు సంబంధిత ఉపాధ్యాయుడి డిక్లరేషన్, మండల విద్యాశాఖాధికారి లేదా ప్రధానోపాధ్యాయుడి కవరింగ్ లెటర్‌ను కూడా జతచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం స్పష్టం చేసింది. అర్హులైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల నియామక వివరాలను పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు పంపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎలాంటి జాప్యం చేయకుండా అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సీపీఎస్ పరిధిలో కొనసాగుతున్న అర్హులైన ఉపాధ్యాయులకు ఈ ప్రక్రియ ద్వారా పాత పెన్షన్ విధానం పొందేందుకు అవకాశం ఏర్పడనుంది. అయితే ప్రతిపాదనల పరిశీలన, అర్హత నిర్ధారణ, తుది ఆమోదం ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయులకు డిసెంబర్‌లో ప్రత్యేక పరీక్షలు!

పిఏటి, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, సింపుల్ బైలింగ్వల్ టెస్ట్ నిర్వహణకు నోటిఫికేషన్

ఈ నెల 20లోగా ఫీజు చెల్లించాలి

ఆలస్య రుసుముతో 24 వరకు అవకాశం



అనంతపురం, నవంబర్ 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అర్హులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు విద్యాశాఖ శుభవార్త అందించింది. డిసెంబర్-2026లో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ , ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ సర్వీస్ పరీక్షలు, గ్రేడ్-। పండితుల సింపుల్ బైలింగ్వల్ టెస్ట్ నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎన్.అయూబ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన ఉపాధ్యాయులు నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

రూ.200 పరీక్ష ఫీజు: పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆలస్య రుసుము లేకుండా రూ.200 పరీక్ష ఫీజు చెల్లించేందుకు నవంబర్ 20, 2026 వరకు అవకాశం కల్పించారు. నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించలేని అభ్యర్థులు అదనంగా రూ.60 ఆలస్య రుసుముతో కలిపి మొత్తం రూ.260 చెల్లించేందుకు నవంబర్ 24, 2026 వరకు గడువు ఇచ్చారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు: అభ్యర్థులు పరీక్ష ఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ నవంబర్ 12, 2026 నుంచి అందుబాటులోకి వచ్చింది. అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.

నవంబర్ 25లోగా సమర్పించాలి: దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన అనంతరం అభ్యర్థుల ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారాలు, నామినల్ రోల్స్ కాపీలను డీడీఓల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి నవంబర్ 25, 2026లోగా సమర్పించాలి. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ప్రకటనలో ఎలాంటి అదనపు అవకాశం పేర్కొనలేదు. అర్హులైన ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు.

బుగ్గరామలింగేశ్వరుని దర్శించుకుని జె.సి ప్రభాకర్‌రెడ్డి దంపతులు



పార్వతీదేవిని దర్శించుకుంటున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 16 ప్రభాతవార్త

కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జె.సి ఉమారెడ్డిలు దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలోని శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామిని, శ్రీపార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చారణలతో జె.సి ప్రభాకర్‌రెడ్డి దంపతులను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలు అందచేశారు. కార్తీక మాసం ఏర్పాట్లపై ఆలయ కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, అర్చకులు ఎం.యోగానందకుమార్‌శర్మ, రామకృష్ణశర్మ, మహేష్‌శర్మ, రవిశర్మ, సహదేవశర్మ, శంతన్‌శర్మ, శంకరయ్యశర్మ, గిరిశర్మ, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

సెల్‌ఫోన్ ప్రభావానికి లోనుకాకుండా పుస్తకాలను చదవాలి

పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి..


అనంతపురం న్యూటౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగా పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మూడో రోజు గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పతికి రమేష్ నారాయణ, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రంగస్వామి, కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగమయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్.ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఎంతోమంది ఉద్యమకారులు గ్రంథాలయాలను వేదికగా చేసుకుని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని, అనంతరం దేశాభివృద్ధికి కూడా విశేషంగా దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా నేడు గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధి చెందిందని, వాటిని పరిరక్షించుకుంటూ యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు గ్రంథాలయ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వయసుల వారికి ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం పలు నోటిఫికేషన్లు విడుదలవుతున్న నేపథ్యంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. డాక్టర్ రమేష్ నారాయణ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెల్‌ఫోన్ల ప్రభావానికి లోనుకాకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గ్రంథాలయాధికారి పి. కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి డి. గోవిందు, కార్యాలయ సిబ్బంది రామాంజినమ్మ, కిరణ్, జీవన, ముత్యాలమ్మ, ఇందిరమ్మ, శిరీష, సరస్వతమ్మ, శ్రీవిజయ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం..

- సమాజంలో పత్రికా రంగం సేవలు మరువలేనివి.. - బిసివి అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ..



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాలు శివరామకృష్ణ , కేక్ కట్ చేస్తున్న దృశ్యం

పెనుకొండ నవంబర్ 16 ప్రభాతవార్త

సమాజంలో పత్రికా రంగం సేవలు మరువలేనివని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలిపారు. జాతీయ పత్రిక దినోత్సవం ను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్టింగ్ యూనియన్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అఫీషియల్ క్లబ్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏజిపి సీనియర్ న్యాయవాది భాస్కరరెడ్డి, బిసివి అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వార్త రిపోర్టర్ ఎజ్జే. పోతులయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా పాత్రికేయులు కేక్ కట్ చేసి జాతీయ పత్రిక దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ,మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య పత్రికలు వారధిగా పనిచేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించుకుం టున్నామని తెలిపారు.భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి నేటివరకు ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయడంలో, ప్రభుత్వ పాలన ,వ్యవస్థల పనితీరును మెరుగుపరచడంలో పత్రికా రంగం విశిష్టమైన పాత్ర పోషిస్తోందన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న అన్యాయాలు, అక్రమాలు, మోసాలు, నేరాలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయడంలో పాత్రికేయులు ముందుంటున్నారని తెలిపారు. కొన్ని సందర్భాలలో పాత్రికేయులపై దాడులు జరుగుతున్నాయని,వీటిని ఎదుర్కొనేందుకు ఏపీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న కృషి అమోఘం అని తెలిపారు.

పాత్రికేయులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పాత్రికేయులు చేస్తున్న పోరాటాలకు బహుజన చైతన్య వేదిక అండగా నిలుస్తుందన్నారు. కాలానుగుణంగా పత్రికా రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను క్షణాల్లో ప్రజలకు చేరవేస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావడంలో మీడియా చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగాన్ని నాలుగో స్తంభంగా (ఫోర్త్ ఎస్టేట్) పిలుస్తారని దీని ద్వారా సమాజంలో మీడియాకు ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చన్నారు.

ఏజిపి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో పత్రికా రంగం కీలకమైన వారధిగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు శివప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ఏజీపీ భాస్కర్ రెడ్డి, బిసివి గౌరవ అధ్యక్షుడు వెంకటేష్, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నవీన్ కుమార్, క్రిస్టఫర్, మల్లికార్జున, గోవిందు, మూర్తి, హరి, హరి, గోపాలప్ప, మధు, శ్రీనివాసులు, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల సమస్యపై వార్త కథనానికి స్పందన!

నార్పల బాలికల పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో

నార్పల, నవంబర్ 16: ప్రభాతవార్త

నార్పల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న మరుగు దొడ్ల సమస్యపై ‘వార్త’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నెల 15న ప్రచురితమైన కథనం నేపథ్యంలో సోమవారం జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ ఎన్. అయూబ్ హుస్సే న్ పాఠశాలను ఆకస్మికం గా తనిఖీ చేశారు. పాఠశాలలో ఎస్ఏ 1పరీక్షల నిర్వహణను డీఈఓ పరిశీలించారు. పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థినులకు కల్పించిన సౌకర్యాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతవాతావరణంలో నిబంధనల ప్రకారంజరిగేలాచూడాలని సూచించారు.



పరిశుభ్రమైన మరుగుదొడ్లు

మరుగుదొడ్ల సమస్యపై ఆరా.. : పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడం, వాటికి తాళాలు వేయడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు నగేష్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు వాపోయారు. ఈ సమస్యపై ‘వార్త’లో కథనం ప్రచురితం కావడంతో డీఈఓ స్వయంగా పాఠశాలకు వెళ్లి మరుగుదొడ్ల పరిస్థితిని పరిశీలించారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం.. : అంతకుముందు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉదయం ప్రార్థనా కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నార్పలలో ఎస్ఏ1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- జీవో ఎంఎస్ నెంబర్ 49 నిబంధనలపై ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డికి వినతి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త



అనంతపురం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 49లోని నిబంధనల వల్ల పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఇటీవల 15 మీటర్ల వరకు ఎత్తు ఉన్న పాఠశాల భవనాలకు ఫైర్ ఎన్ఓసీ నుంచి మినహాయింపు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఆ సమాచారం విద్యాశాఖ అధికారులకు స్పష్టంగా చేరకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులపై విద్యాశాఖ నుంచి స్పష్టమైన మార్గ

04ATP13_04ATP13.qxd 16-11-2026 PM 10:27 Page 1

ఉరవకొండలో విచ్చలవిడిగా అక్రమ కుళాయిల దందా..!

- సొంత లాభం చూసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు కార్మికులు

- అధికారులకు చెప్పకుండా, డిపాజిట్లు కట్టించకుండా కనెక్షన్లు ఇచ్చేస్తున్న వైనం

- అక్రమ కుళాయి కనెక్షన్లు ఇచ్చే క్రమంలో ధ్వంసమవుతున్న రోడ్లు, పైప్‌లైన్లు

- నిలువరించకపోతే వేసవిలో తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశం



ఉరవకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

ఉరవకొండ, నవంబర్ 16 ప్రభాతవార్త

ఉరవకొండలో తాగునీటి అక్రమ కుళాయి కనెక్షన్ల దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. కొందరు కిందిస్థాయి సిబ్బంది, కార్మికులు సొంత లాభం చూసుకొని ఇష్టారాజ్యంగా కుళాయి కనెక్షన్లు ఇస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కొందరు కార్మికులు గృహాల యజమానులతో ఒప్పందం చేసుకోవడం ఆ వెంటనే పదుల మీటర్ల పైప్‌లైన్లు వేసి కుళాయి కనెక్షన్లు ఇచ్చేస్తుండటంతో రోడ్లతోపాటు ప్రధాన తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమవుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా అధికారులకు తెలియదా లేక తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా అన్న ప్రశ్న తలెత్తుతోంది, తత్ఫలితంగా రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు ఎదుర్కొని పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే...

ఉరవకొండ పట్టణంలో ప్రైవేటు కుళాయిలు దాదాపు 6,800 వరకు ఉండగా గతంలో వేసిన పబ్లిక్ కుళాయిలు మరో 100 ఉంటాయని సమాచారం. అధికారికంగా కొత్తగా తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలంటే గృహ వినియోగదారు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు 5,500 రూపాయలు డిపాజిట్‌ను డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అయితే పట్టణంలో నూతన పైప్‌లైన్లు వేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేంతవరకు ఎక్కడా కుళాయి కనెక్షన్లు ఇవ్వకూడదని ప్రస్తుతం ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. అయితే కొందరు కార్మికులు వాటిని పట్టించుకోకుండా తమ సొంత లాభం కోసం ముఖ్యంగా శివారు, తదితర కాలనీల్లో కొంత కాలంగా విచ్చలవిడిగా కుళాయి కనెక్షన్లు ఇచ్చేస్తున్నట్లు తెలిసింది. పదుల మీటర్ల కొద్ది ఇష్టారాజ్యంగా గుంతలు తవ్వడం రాత్రికి రాత్రే కనెక్షన్లు ఇచ్చేయడం పరిపాటిగా మారుతోంది. అ క్రమ కుళాయి కనెక్షన్లు ఇచ్చే సమయంలో ప్రధాన పైప్‌లైన్లకు రంధ్రాలు పెట్టడం, రోడ్లను ధ్వంసం చేయడం జరుగుతోందని పలు కాలనీల ప్రజలు వాపోతున్నారు. కొందరు సిబ్బంది మమ్మల్నెవరు ప్రశ్నించేది అన్నట్లు వ్యవహరిస్తున్నా వారిని అధికారులు నిలువరించపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే తంతు ఇలాగే కొనసాగితే రాబోయే వేసవిలో నీటి కొరత ఏర్పడుతుందని ఇప్పటికైనా మేలుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాలుగు కుటుంబాలు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిక



వైసీపీ నుండి టిడిపిలో చేరిన బ్రహ్మసముద్రం నాయకులు

కళ్యాణదుర్గం, నవంబర్ 16 ప్రభాతవార్త:

బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లి, బొమ్మగానిపల్లి తాండాకు చెందిన నాలుగు వైసీపీ కుటుంబాలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరాయి. సోమవారం ప్రజావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కేశవ నాయక్, పాండు నాయక్, కిషోర్ నాయక్, రంగస్వామిలకు ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రానున్న సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

రీసర్వే పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

అనంతపురం కలెక్టరేట్ నవంబర్ 16 ప్రభాతవార్త

రీసర్వే పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం జిల్లాలో రీ సర్వే మీద నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులతో రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- ఎన్నికలు ముగిసేవరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు

- ఈ నేపథ్యంలో ప్రజలు ఆన్ లైన్ లో ఫిర్యాదు చేయవచ్చు

- పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ నవంబర్ 16 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు చేయడం జరగగా, పిజిఆర్ఎస్ రద్దు అయిన కారణంగా ప్రజలు ఆన్ లైన్ లో ఫిర్యాదు చేయవచ్చని, మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాల ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలుచేసిన తమఅర్జీలు ఇప్పటికీపరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జిఓ వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ ..

ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుల పరిష్కారంపై తమ అభిప్రాయాలను తెలియజేయడం పూర్తిగా పౌరుల స్వచ్ఛంద నిర్ణయం అని అన్నారు.

కంబదూరు మల్లేశ్వరుడికి కార్తీక శోభ..



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వర స్వామి

కంబదూరు, నవంబర్ 16, ప్రభాత వార్త

కార్తీక మాసం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధి చెందిన కంబదూరు మండల కేంద్రంలోని కమల మల్లేశ్వర స్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. కార్తీక సోమవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సోమవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే మల్లేశ్వర స్వామి, పార్వతీ అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులుతీర్థప్రసాదాలు అందజేశారు. శివపార్వతులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో శివాలయాన్ని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రెండో దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు పటిష్ట భద్రత..

- నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ.. - గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో ఎన్నికలు..

అనంతపురం క్రైమ్ నవంబర్ 16 ప్రభాతవార్త

జిల్లాలో రెండో దశలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. రెండో దశ గ్రామపంచాయతీ ఎన్నికలకు నవంబర్ 16న నోటిఫికేషన్ విడుదల కాగా.. నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నవంబర్ 29న పోలింగ్, అదేరోజు ఓట్లలెక్కింపు జరగనుంది.

రెండో దశలోని 9 మండలాలు ఇవే..

గుంతకల్లు నియోజకవర్గం.. : గుంతకల్లు, గుత్తి, పామిడి

శింగనమల నియోజకవర్గం.. : శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, ఎల్లనూరు, పుట్లూరు

నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు..

నామినేషన్ కేంద్రాల వద్ద ముందస్తుగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. అభ్యర్థులు, వారి అనుచరులు భారీగా గుమిగూడకుండా నిబంధనల ప్రకారం నియంత్రణ చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధి తదితర ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయనున్నారు. ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టారు. గత ఎన్నికల్లో వివాదాలు చోటుచేసుకున్న ప్రాంతాలు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగించనున్నారు. సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలోని నామినేషన్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్‌టీలు సిద్ధంగా ఉంచారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టి, ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల తయారీకి ప్రత్యేక చర్యలు!

- ప్రత్యేక కేటగిరీల ఉద్యోగులు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వితంతువులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లిదండ్రులకు వర్తింపు - ఈ నెల 20వ తేదీ తుది గడువు

- ఆ తర్వాత సమర్పించే పత్రాలు పరిగణనలోకి తీసుకోరు



అనంతపురం న్యూటౌన్, నవంబర్ 16 ప్రభాతవార్త

జిల్లాలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల తయారీ ప్రక్రియకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025, జిల్లా పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల వివరాలు, సీనియారిటీకి సంబంధించిన అర్హతలు, ప్రత్యేక కేటగిరీలకు చెందిన ఉద్యోగుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు తమ అర్హతలను నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నవంబర్ 16న జారీ చేసిన ఉత్తర్వుల్లో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు 1,2, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వితంతువులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లల తల్లిదండ్రులు, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది.

కేటగిరీల వారీగా ధ్రువీకరణ పత్రాలు:

ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులు కుల ధ్రువీకరణ పత్రంతోపాటు సర్వీస్ రిజిస్టర్ మొదటి పేజీ బయోడేటా కాపీ, సంబంధిత నియామక ఉత్తర్వులు, అవసరమైన ఇతర ఆధారాలను సమర్పించాలి. 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగ ఉద్యోగులు సదరం ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా అందజేయాలి. సర్వీస్ రిజిస్టర్ వివరాలు, సంబంధిత వైకల్య ధ్రువీకరణ పత్రాలను కూడా జత చేయాలి. భర్తను కోల్పోయిన వితంతు ఉపాధ్యాయులు భర్త మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు పునర్వివాహం చేసుకోలేదని తెలిపే స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. సంబంధిత కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఆధారాలను కూడా అందజేయాల్సి ఉంటుంది. మానసిక వైకల్యం కలిగిన పిల్లలున్న ఉపాధ్యాయులు తమ పిల్లలకు సంబంధించిన సదరం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలి. అదేవిధంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులు క్యాన్సర్, కిడ్నీ, గుండె, కాలేయం, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులకు సంబంధించిన వైద్య ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి. జిల్లా విద్యాశాఖ నిర్దేశించిన ప్రకారం జిల్లా మెడికల్ బోర్డు ద్వారా ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు:

మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని సంబంధిత ఉపాధ్యాయులకు ఈ విషయాన్ని తెలియజేయాలి. వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సేకరించి, సర్వీస్ రిజిస్టర్లలోని వివరాలతో సరిపోల్చి పరిశీలించాలి. ఉద్యోగుల పేరు, సి ఎఫ్ ఎం ఎస్ ఐడి /ఎంప్లాయ్ ఐడి, హోదా, పాఠశాల పేరు, మండలం, కేటగిరీ, సీనియారిటీకి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలి. అలాగే ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేసిన వివరాలు, సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, అర్హతలకు సంబంధించిన ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి నిర్దిష్ట గడువులోగా పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

20వ తేదీలోగా సమర్పించాలి:

ప్రత్యేక కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 20వ తేదీ లోగా సమర్పించాలి. నిర్దిష్ట గడువు తర్వాత సమర్పించే ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎన్.అయ్యూబ్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను అత్యంత అత్యవసరంగా చేపట్టి, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025, జిల్లా పునర్విభజన నేపథ్యంలో సీనియారిటీ జాబితాల తయారీలో అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా, సర్వీస్ రికార్డుల్లో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఉండేందుకు ఈ ధ్రువీకరణ పత్రాల సేకరణ, పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోంది.

జాతీయ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



జాతీయ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సిటీ, నవంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెస్ట్ గోదావరి జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 4 : 100 రిలే రేస్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సిల్వర్ మెడల్‌ను సాధించారు. హర్యానాలో జనవరిలో జరిగే జాతీయ పోటీలలో జిల్లా నుంచి హేమహరిణి, సంధ్య, ఐశ్వర్య, ఇంద్రలేకలు ఎంపికయ్యారు. అదే విధంగా బాలుర విభాగంలో రిలే రేస్ పోటీలలో భరత్‌కుమార్, అజయ్‌నాయక్, రేణు, గణేష్, చరణ్‌లు పోటీలలో సాధించారు. 3కె వాక్‌లో ధరణి సిల్వర్ మెడల్ సాధించి రెండవ స్థానంలో నిలిచారు. అదే విధంగా వర్షిత్‌కుమార్, హమ్మర్‌త్రో విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించారు. జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాలలో సత్తాచాటి పతకాలు సాధించడంతోపాటు జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ సత్యనారాయణ క్రీడాకారులను అభినందించారు.

ఉత్సాహ భరితంగా దివ్యాంగుల క్రీడాపోటీలు ప్రారంభం



దివ్యాంగుల పోటీల ప్రారంభ కార్యక్రమంలో జిల్లా అధికారులు

అనంతపురం సిటీ, నవంబర్ 16 ప్రభాతవార్త

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీలు ఉత్సాహ భరితంగా సాధించాయి. స్థానిక పిటిసి మైదానంలో పారాఅథ్లెటిక్స్, పారా బ్యాడ్మింటన్ వీల్ చైర్ పెన్సింగ్, బ్లైండ్ గోల్‌బాల్, పారా తైక్వాండో, పారా టేబుల్ టెన్నిస్‌పోటీలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సూయాస్ కుమార్ ప్రారంభించారు. క్రీడలలో పారాఅథ్లెటిక్స్‌లో కూడా ప్రతిభను కనబరుస్తూ పతకాలు సాధిస్తుండటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి మంజుళ, జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ ఎడి అర్చన, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలజా, పారా అసోషియేషన్ సెక్రెటరీ శ్రీనివాసులుతోపాటు పలువురు కోచ్‌లు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కదిరి నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యం

- ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రహదారి విస్తరణ పనులు - ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



పర్యాటక అభివృద్ధి పనులపై వీడియో ప్రజంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట, పుర ప్రముఖులు

కదిరి, నవంబర్ 16 ప్రభాతవార్త

కదిరి పట్టణ అభివృద్ధితోపాటు నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో తిరుమడ వీధుల రోడ్డు విస్తరణ, స్వాతినక్షత్రం సందర్భంగా కదిరి కొండ (స్తోత్రాద్రి) గిరి ప్రదర్శనకు వచ్చే భక్తులకు, పర్యటనకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చేపట్టనున్న సుందరీకరణ, రహదారి అభివృద్ధి పనులపై పుర ప్రముఖులతో కలిసి వీడియో ప్రజంటేషన్ కార్యక్రమంలో పుర ప్రముఖులతోపాటు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమడ వీధులు, జీమాన్ సర్కిల్, ఎగ్బాల్‌రోడ్డు ప్రాంతాల్లో చేపట్టవలసిన రహదారి విస్తరణ పనులపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులు, స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తిరుమడ వీధులు రోడ్డు విస్తరణతోపాటు జీమాన్ సర్కిల్, ఎగ్బాల్‌రోడ్డు విస్తరణ పనులు తప్పనిసరిగా చేపడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలను చట్ట ప్రకారం తొలగించి అదే సమయంలో స్థానికులకు, వ్యాపారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయ బద్ధంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా అందించారు. ఎవరి మనస్సులు నొప్పించాలన్నది మా ఉద్దేశ్యం కాదని ప్రతి కుటుంబ సమస్యను అర్థం చేసుకుని అందరినీ సంప్రదించి వారిని ఒప్పించి న్యాయబద్ధంగా పరిహారం అందిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పట్టణంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీఖాధ్రి లక్ష్మీనరసింహ క్షేత్రం సహా నియోజకవర్గంలోని పర్యటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను అనుసంధానిస్తూ కదిరిని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తమవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్ఎస్ఈ సంజీవరాయుడు, మున్సిపల్ కమిషనర్, టిడిపి నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కన్నతల్లిపై గొడ్డలితో దాడిచేసిన కుమారుడు



తీవ్రంగా గాయపడిన మహబూబ్‌జాన్

కదిరి, నవంబర్ 16 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధిలోని కుటాగులలో అప్పులు తీర్చేందుకు, మద్యం కొనుగోలుకు డబ్బులు ఇవ్వలేదన్న నెపంతో నవమాసాలు మోసి జన్మనిచ్చిన కన్నతల్లిపైనే గొడ్డలితో దాడిచేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు కుటాగుల దర్గా వీధికి చెందిన ఎస్.మహబూబ్‌జాన్ (57) చింతపండు గోడౌన్‌గా కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె పెద్దకుమారుడు బాబ్‌జాన్ మధ్యానికి బానిసై అప్పులు తీర్చేందుకు, మద్యం తాగేందుకు పైసలు ఇవ్వాలని వారం రోజులుగా తల్లిని వేదిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే నిన్ను చంపేస్తానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో మహబూబ్‌జాన్ గోడౌన్‌లో పని చేస్తుండగా బాబ్‌జాన్ అక్కడికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చారు. ఆమె ససేమీరా అనడంతో మాటామాటా పెరిగి గొడవ పెరిగి గొడ్డలితో తలపై తీవ్రంగా దాడిచేసి గాయ పరిచాడు. అనంతరం అక్కడి నుంచి బాబ్‌జాన్ పరారయ్యాడు. ఈ విషయం గమనించిన అక్కడ ని చేస్తున్న కూలీలు 108 అంబులెన్స్‌కి ఫోన్ చేయడంతో వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోడౌ